ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :185 గురువారం ఏప్రిల్ 30 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

## ప్రపంచ వేదికపై భారత్ గర్జన

- ఐక్యరాజ్యసమితిలో శాశ్వత పీఠం దిశగా కీలక అడుగులు
- వీటో అధికారంతోనే సంస్కరణలు సాధ్యం
- జి4 కూటమి ప్రతిపాదనకు భారత్ మద్దతు
- 80 ఏళ్ల నాటి పాత వ్యవస్థకు చరమగీతం





ఏప్రిల్ 29 (మనప్రజాప్రతినిధి): ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాలనే డిమాండ్ మరోసారి ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి రాయబారి పి. హరీష్, భద్రతా మండలి సంస్కరణలపై జరుగుతున్న అంతర ప్రభుత్వ చర్చల్లో కీలక ప్రసంగం చేశారు. కేవలం సభ్యత్వ విస్తరణ మాత్రమే కాకుండా, వీటో అధికారంతో కూడిన శాశ్వత సభ్యత్వమే నిజమైన సంస్కరణ అని భారత్ స్పష్టం చేసింది. ప్రస్తుత వ్యవస్థ 80 ఏళ్ల నాటి కాలం చెల్లిన పద్ధతులతో నడుస్తోందని, ఇది నేటి భౌగోళిక రాజకీయ వాస్తవాలను ప్రతిబింబించడం లేదని భారత్ ఘాటుగా విమర్శించింది. శాశ్వత సభ్యత్వం విషయంలో వస్తున్న ప్రతిష్టంభనను తొలగించేందుకు భారత్ ఒక వ్యూహాత్మక వెసులుబాటును ప్రకటించింది. జి4 కూటమి (భారత్, బ్రెజిల్, జర్మనీ, జపాన్) చేసిన ప్రతిపాదనకు భారత్ మద్దతు తెలిపింది. దీని ప్రకారం, కొత్తగా చేరే శాశ్వత సభ్య దేశాలకు మొదటి 15 ఏళ్ల వరకు వీటో అధికారాన్ని వాయిదా వేయవచ్చు. ఆ తర్వాత సమీక్ష నిర్వహించి తుది నిర్ణయం తీసుకోవాలని భారత్ సూచించింది. చర్చల్లో పురోగతి కోసం ఈ స్థాయిలో మొగ్గు చూపడం భారత్ యొక్క చిత్తశుద్ధిని చాటిచెబుతోంది. అయితే, వీటో అధికారం లేని రెండో స్థాయి శాశ్వత సభ్యత్వాన్ని మాత్రం భారత్ నిర్ద్వంద్వంగా వ్యతిరేకించింది.ప్రస్తుత భద్రతా మండలిలో ఐదు శాశ్వత సభ్య దేశాల పెత్తనం కొనసాగుతోంది. చైనా, ఫ్రాన్స్, రష్యా, యూకే, అమెరికాలు మాత్రమే వీటో అధికారాన్ని కలిగి ఉన్నాయి. 1965లో జరిగిన ఏకైక సంస్కరణలో కేవలం తాత్కాలిక సభ్య దేశాల సంఖ్యను మాత్రమే పెంచారని, దీనివల్ల శాశ్వత సభ్యుల బలం మరింత పెరిగిందని భారత్ గుర్తు చేసింది. ఆఫ్రికా, గ్లోబల్ సౌత్ దేశాలకు సరైన ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల మండలి నిర్ణయాలకు చట్టబద్ధత కరువవుతోందని భారత్ వాదించింది. ప్రపంచ జనాభాలో మెజారిటీ వాటా ఉన్న దేశాలకు నిర్ణయాధికారంలో భాగస్వామ్యం లేకపోవడం అన్యాయమని పేర్కొంది.భారత్ చేస్తున్న ఈ పోరాటానికి అంతర్జాతీయ స్థాయిలో మద్దతు పెరుగుతోంది. యూకే, ఫ్రాన్స్ వంటి దేశాలు భారత్‌కు బహిరంగంగా మద్దతు తెలుపుతుండగా, చైనా వంటి దేశాలు మాత్రం కొన్ని షరతులతో అడ్డుకుంటున్నాయి. మరోవైపు, 'యునైటింగ్ ఫర్ కన్సెన్సస్' (కాఫీ క్లబ్) పేరుతో పాకిస్థాన్, ఇటలీ వంటి దేశాలు శాశ్వత సభ్యత్వ విస్తరణను వ్యతిరేకిస్తున్నాయి. ఇటువంటి అడ్డంకులను అధిగమించేందుకు భారత్ తన దౌత్యపరమైన ఒత్తిడిని పెంచుతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, వేగంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా భారత్‌కు ఈ పదవి దక్కడం చారిత్రక అవసరమని విశ్లేషకులు భావిస్తున్నారు.ఐక్యరాజ్యసమితి మనుగడ సాగించాలంటే కాలంతో పాటు మారక తప్పదని భారత్ హెచ్చరించింది. భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టకపోతే, అంతర్జాతీయ శాంతి భద్రతను కాపాడటంలో ఈ సంస్థ విఫలమయ్యే ప్రమాదం ఉందని భారత్ అభిప్రాయపడింది. రాబోయే సాధారణ అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశంపై మరింత లోతైన చర్చలు జరిగే అవకాశం ఉంది. భారత్ పట్టుబట్టినట్లుగా వీటో అధికారంతో కూడిన శాశ్వత పీఠం దక్కితే, ప్రపంచ రాజకీయాల్లో భారత్ ఒక తిరుగులేని శక్తిగా అవతరిస్తుంది. ఈ లక్ష్య సాధన కోసం భారత్ తన గళాన్ని మరింత బలంగా వినిపిస్తోంది.



## మంత్రి పదవిపై స్పష్టత



- నామినేటెడ్ పోస్టులపై ఆశలు: కోదండరాం
- మంత్రి పదవి అడగలేదని వ్యాఖ్య
- ప్రభుత్వంలో భాగస్వామ్యం కోరుతున్నట్టు వెల్లడి
- కేసీఆర్ పాలనపై విమర్శలు

హైదరాబాద్, ఏప్రిల్ 29 (మన ప్రజాప్రతినిధి): తనకు మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ చెప్పలేదని, తాను కూడా అలాంటి అభ్యర్థన చేయలేదని తెలంగాణ జన సమితి అధినేత కోదండరాం స్పష్టం చేశారు. అయితే తన పార్టీకి చెందిన నాయకులకు త్వరలోనే నామినేటెడ్ పోస్టులు లభిస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉండాలని తమ ఆకాంక్షను బహిరంగంగానే వ్యక్తం చేసిన ఆయన, రాజకీయంగా తాము సముచిత స్థానం కోరుకుంటున్నామని చెప్పారు. తమ పార్టీకి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనపై కోదండరాం తీవ్ర విమర్శలు చేశారు. ఆ సమయంలో ప్రజలు, నాయకులు ఒక రకమైన భయాందోళనలో జీవించారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ, జాగ్రత్తగా మాట్లాడాల్సిన పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు.కేసీఆర్ ప్రజల నుంచి దూరమయ్యారని, అందుకే ఇప్పుడు మళ్లీ ప్రజల్లోకి రావడానికి ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల విశ్వాసం కోల్పోయిన నాయకత్వం తిరిగి నమ్మకం పొందడం కష్టం అని వ్యాఖ్యానించారు. ఇక కవిత కొత్త పార్టీ ఏర్పాటుపై స్పందిస్తూ, ఆమె వ్యాఖ్యల ద్వారా కుటుంబ రాజకీయాల అంతర్గత అంశాలు బయట పడుతున్నాయని విమర్శించారు. పార్టీ అంటే ఒక కుటుంబమే అన్న భావన ఆమె చర్యల్లో కనిపిస్తోందని అన్నారు. తమ పార్టీ ఎన్నికల కోసమే కాకుండా మార్పు కోసం పని చేస్తుందని కోదండరాం స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేస్తామని, ముందుగానే నియోజకవర్గాలను ఎంపిక చేసుకుని వ్యూహాత్మకంగా ముందుకు సాగుతామని ప్రకటించారు.

## గంగా ఎక్స్‌ప్రెస్‌వే ప్రారంభం



- యూపీ అభివృద్ధికి కొత్త దిశ
- రూ. 36,230 కోట్ల ప్రాజెక్టును జాతికి అంకితం
- ప్రయాణ సమయం గణనీయంగా తగ్గింపు
- పరిశ్రమలు, పర్యాటకానికి ఊతం

ఉత్తర ప్రదేశ్, ఏప్రిల్ 29 (మనప్రజాప్రతినిధి): ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి కొత్త జీవనాడిలా మారే గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. హర్దోయ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సుమారు రూ. 36,230 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ భారీ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. గంగా నది పరిసర ప్రాంతాల గుండా సాగే ఈ రహదారి రాష్ట్ర అభివృద్ధికి కీలకంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రధాని, గంగా నది దేశానికి ఎలా జీవనాడిగా ఉందో, అదే విధంగా ఈ ఎక్స్‌ప్రెస్‌వే కూడా ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి ప్రధాన మార్గంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ రహదారికి గంగా పేరు ఇవ్వడం ఆనందంగా ఉందని తెలిపారు. అభివృద్ధి దార్శనికతతో పాటు దేశపు వారసత్వాన్ని ప్రతిబింబించే ప్రాజెక్టు ఇదని వివరించారు.ఈ ఎక్స్‌ప్రెస్‌వేతో ప్రయాగ్‌రాజ్‌లోని సంగమం, కాశీలోని

2

## నారా లోకేశ్‌కు... జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు



- "శభాష్ లోకేశ్" చంద్రబాబు ప్రశంసలు
- కొత్త కార్యవర్గంతో టీడీపీకి కొత్త దిశ
- క్రమశిక్షణ, సమన్వయంపై నేతలకు హితవు

మంగళగిరి, ఏప్రిల్ 29 (మనప్రజాప్రతినిధి): తెలుగుదేశం పార్టీలో నూతనోత్సాహాన్ని నింపుతూ, భవిష్యత్ కార్యాచరణకు స్పష్టమైన సంకేతాలిస్తూ నారా లోకేశ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆయనను అభినందిస్తూ "శభాష్ లోకేశ్" అని కొనియాడారు. కేవలం అనుమతులతో కాదు, పనితీరుతోనే పదవులు సాధించవచ్చని లోకేశ్ నిరూపించారని ప్రశంసించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రబాబు, పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. పార్టీకి కొత్త ఉత్సాహాన్ని అందించేలా ఈ సమావేశం సాగింది.ఈ సందర్భంగా లోకేశ్ పాత్రను ప్రస్తావిస్తూ, ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కార్యకర్తలను చైతన్యవంతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని చంద్రబాబు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీని మరింత

2

## బీఆర్ఎస్‌లో భారీ చేరికలు



- రేవంత్ వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపాటు
- తెలంగాణ భవన్‌లో కల్వకుర్తి నేతల చేరిక
- "ప్రజల బాధలపై ఆనందం అనడం దారుణం"
- రైతులు, విద్యార్థులు, అన్ని వర్గాల సమస్యలపై తీవ్ర విమర్శలు

హైదరాబాద్, ఏప్రిల్ 29 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలు పార్టీల కీలక నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై విస్తృతంగా స్పందిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రజలు ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే తనకు "పైశాచిక ఆనందం" కలుగుతుందని రేవంత్ రెడ్డి చెప్పడం అత్యంత బాధాకరమని కేటీఆర్ అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను చూసి బాధపడాల్సిన బాధ్యత ఉన్న

2

# గంగా ఎక్స్‌ప్రెస్‌వే ప్రారంభం

మొదటి పేజీ తరువాయి



విశ్వనాథ ఆలయ దర్శనం తక్కువ సమయంలో సాధ్యమవుతుందని తెలిపారు. గతంలో గంటల తరబడి పట్టే ప్రయాణం ఇప్పుడు వేగవంతమవుతుందని చెప్పారు. ప్రజలకు సౌకర్యం పెరుగుతుందని వెల్లడించారు. ఈ గంగా ఎక్స్‌ప్రెస్‌వే మొత్తం 594 కిలోమీటర్ల పొడవుతో నిర్మితమైన ఆరు లేన్ల నియంత్రిత గ్రీన్‌ఫీల్డ్ రహదారి. భవిష్యత్తులో దీనిని ఎనిమిది లేన్లకు విస్తరించే అవకాశం ఉంది. ఇది మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ వరకు పన్నెండు జిల్లాల గుండా ప్రయాణిస్తూ రాష్ట్రంలోని పశ్చిమ, మధ్య, తూర్పు ప్రాంతాలను అనుసంధానిస్తుంది. ఈ రహదారి ద్వారా మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ మధ్య ప్రస్తుతం 10 నుంచి 12 గంటలు పట్టే ప్రయాణ సమయం కేవలం ఆరు గంటలకు తగ్గనుంది. ఇది రవాణా రంగంలో పెద్ద మార్పుకు దారి తీస్తుందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా షాజహాన్‌పూర్ జిల్లాలో 3.5 కిలోమీటర్ల అత్యవసర విమాన దిగుబడి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఇది రక్షణ అవసరాలకు కూడా ఉపయోగపడనుంది. రహదారి వెంట పారిశ్రామిక కారిడార్లు, సరకు రవాణా కేంద్రాలు అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించారు. దీంతో పరిశ్రమల పెట్టుబడులు పెరగడం, రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు లభించడం, పర్యాటక రంగం అభివృద్ధి చెందడం, ఉపాధి అవకాశాలు విస్తరించడం వంటి ప్రయోజనాలు లభిస్తాయని అధికారులు తెలిపారు. ఇతర ఎక్స్‌ప్రెస్‌వేలతో అనుసంధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర అభివృద్ధికి ఇది దోహదపడనుంది.

# నారా లోకేశ్‌కు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు

మొదటి పేజీ తరువాయి



బలోపేతం చేస్తూ, కార్యకర్తల సంక్షేమం నుంచి శిక్షణా కార్యక్రమాల వరకు అన్ని బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఆయన కృషి ఫలితంగానే రాష్ట్రానికి ప్రముఖ సంస్థలు ఆకర్షితమవుతున్నాయని చెప్పారు. కొత్త కార్యవర్గ కూర్పుపై మాట్లాడుతూ, సీనియార్టీ, నిబద్ధత, సామాజిక సమతుల్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కమిటీలను రూపొందించినట్లు తెలిపారు. సీనియర్ల అనుభవాన్ని వినియోగించుకుంటూనే యువతకు అవకాశాలు కల్పించామని వివరించారు. పార్టీ చరిత్రలో తొలిసారిగా గ్రామ స్థాయి నాయకత్వానికి కూడా పొలిట్ బ్యూరోలో స్థానం కల్పించడం ద్వారా "కార్యకర్తే అధినేత" అనే భావనను ఆచరణలోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. మహిళలకు కూడా ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు.మరో మూడేళ్లలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు సూచించారు. ప్రతి బూత్‌లో గతం కంటే ఎక్కువ ఓట్లు సాధించడం లక్ష్యంగా పెట్టుకోవాలని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలపై కూడా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. తమ పనులకు క్రెడిట్ తీసుకోవడమే వారి లక్ష్యమని ఆరోపించారు. గతంలో ఎన్నో రాజకీయ పోరాటాలు చేసినప్పటికీ, ఇప్పుడు పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని నేతలకు సూచించారు. అధికారంలో ఉన్నామనే భావంతో అహంకారం ప్రదర్శించవద్దని, క్రమశిక్షణతో పనిచేయాలని చంద్రబాబు హితవు పలికారు. మిత్రపక్షాలతో సమన్వయంగా పనిచేస్తూ ప్రజలకు సేవ చేయాలని, ప్రతి నాయకుడు ప్రజలతో సాన్నిహిత్యంగా ఉండాలని సూచించారు. పార్టీ ప్రతిష్టను కాపాడే విధంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో భారీ చేరికలు



ముఖ్యమంత్రి, ఆ బాధలనే ఆనందంగా భావించడం అనైతికమని విమర్శించారు. ప్రజల సమస్యలను ప్రతిపక్షాలు ప్రస్తావిస్తే, దాన్ని వ్యక్తిగతంగా తీసుకుని ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని కేటీఆర్ ఆరోపించారు. గురుకుల విద్యాసంస్థల్లో జరిగిన ఘటనలను ప్రస్తావిస్తూ, విద్యార్థుల మరణాలు జరిగినా ప్రభుత్వానికి కనీస స్పందన లేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. విద్యార్థుల సమస్యలపై మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని ప్రస్తావించారు. బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కోర్టు తీర్పుల కారణంగా విద్యార్థులపై అదనపు భారాలు పడుతున్నా ప్రభుత్వం ముందడుగు వేయడం లేదని విమర్శించారు. దీనివల్ల పేద విద్యార్థుల చదువు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పంటల కొనుగోళ్లు దాదాపు పూర్తిగా నిలిచిపోయాయని, ధాన్యం, మొక్కజొన్న, జొన్నల కొనుగోలు కేంద్రాలు సక్రమంగా ప్రారంభించలేదని ఆరోపించారు. రైతులు తెచ్చిన ధాన్యం రోడ్లపై వర్షాలకు తడుస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు కేటాయించడంలో కూడా ఆలస్యం జరుగుతోందని, బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే కారణంతో కొనుగోళ్లు ఉద్దేశపూర్వకంగా వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. దీంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. రైతుబంధు నిధులు సమయానికి జమ కావడం లేదని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉన్నాయని కూడా విమర్శించారు.ప్రభుత్వంపై విమర్శలు చేస్తే వాటిని స్వీకరించి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉండగా, ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం ద్వారా తప్పించుకోవడం సరైంది కాదని కేటీఆర్ పేర్కొన్నారు. "నేను మారిన మనిషిని" అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి, మాటల్లో మాత్రం మార్పు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు.ప్రజల బాధలను అర్థం చేసుకోకుండా వ్యాఖ్యలు చేయడం ఒక ముఖ్యమంత్రికి తగదని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలే తగిన నిర్ణయం తీసుకుంటారని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్తులో వాటికి తగిన సమాధానం ఇస్తారని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంతో బీఆర్ఎస్‌లో చేరికలు కొనసాగుతున్నాయని, క్షేత్రస్థాయిలో పార్టీ బలం పెరుగుతోందని నాయకులు పేర్కొన్నారు. రాబోయే రాజకీయ పరిణామాల్లో బీఆర్ఎస్ మరింత బలంగా నిలుస్తుందని పార్టీ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.

# నూతన గ్రామపంచాయతీ

## లాల్ లక్ష్మీపురంలో







- అంగన్వాడి,డీలర్ గ్రామ పంచాయతీ సిబ్బందినీ అధికారికంగా ప్రకటన చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు..
- అంగన్వాడి డీలర్ అర్హులైన విద్య అర్హత కలిగి ఎగ్జామ్ లో పాసైన వారికి, డీలర్, అంగన్వాడి ఇవ్వాలని ప్రజలు వేడుకుంటున్నారు....
- విద్య అర్హత కలిగినవారికి ఇవ్వాలి. విద్యా అర్హత లేని వారికి అవసరం లేదు.
- డీలర్ అంగన్వాడిలకు పైరవులు పెద్ద ఎత్తున ఊపందుకు ఉన్నాయని గ్రామాలలో గుసగుసలు వినిపిస్తున్నాయి.
- నూతన గ్రామపంచాయతీలో అంగన్వాడి, డీలరు, ఇంకా ఏమైనా కాంటాక్ట్ బేసిక్ లో ఉన్న గ్రామ సర్పంచి, కార్యదర్శి అధికార ప్రకటన చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు...

మనప్రజాప్రతినిధి//నేరేడుచర్ల: సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల మండలం నూతన గ్రామపంచాయతీ లాల్ లక్ష్మి పురం సర్పంచ్ ఎలక్షన్ లు అయిపోయి 4నాలుగు నెలలకు పైగా అవుతున్నా అధికారికంగా ప్రకటన చెయ్యకపోవడం విడ్డూరంగా ఉన్నది. గ్రామపంచాయతీ సిబ్బంది, అంగన్వాడి టీచర్, డీలర్, ఇంతవరకు ప్రకటన చేయకపోవడంతో గతంలో గ్రామపంచాయతీ గా ఉన్న కల్లూరు గ్రామానికి వెళ్లి బియ్యం తీసుకోవడం తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు గ్రామపంచాయతీ ఏర్పాటు అయిన తర్వాత కూడా వెళ్లాలా. అంగనవాటి టీచర్, డీలర్, సిబ్బందిని తక్షణమే నియమించాలని ప్రభుత్వానికి అధికారులకు విన్నపం చేస్తున్న గ్రామ ప్రజలు, గ్రామంలో అంగన్వాడి టీచర్, డీలర్, ఎగ్జామ్ పెట్టి, అర్హులైన వారికి మాత్రమే ఇవ్వాలని ప్రజలు వేడుకుంటున్నారు. మండల్ లేవల్ నుండి, కలెక్టరేట్ వరకు పైరవులు జోరందుకున్నాయని ప్రజలలో పెద్ద ఎత్తున గుసగుసలు వినిపిస్తున్నాయి. గ్రామ సర్పంచ్ మేమందరం ఓట్లు వేస్తే గెలిచాడు పైరవుల కాకుండా, అర్హులకు మాత్రమే ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

# టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా

## నారా లోకేశ్ ప్రమాణస్వీకారం

**-మంగళగిరిలో ఘనంగా కార్యక్రమం**
**-'పాత-కొత్త' కలయికకు ప్రాధాన్యం**
**-క్షేత్రస్థాయి కార్యకర్తలకు పెద్దపీట**



మంగళగిరి, ఏప్రిల్ 29 (మనప్రజాప్రతినిధి): తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యువనేత, మంత్రి నారా లోకేశ్ ప్రమాణ స్వీకారం చేశారు. పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీల సభ్యులతో కూడా ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యవర్గ కూర్పులో యువతకు, క్షేత్రస్థాయి కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తూనే అనుభవజ్ఞులైన నేతలను కొనసాగించడం ద్వారా 'పాత–కొత్త' సమతుల్యతను పార్టీ సాధించింది. ఇది పార్టీ భవిష్యత్ వ్యూహంలో కీలక మార్పుగా భావిస్తున్నారు.ముఖ్యంగా మండల, క్లస్టర్ స్థాయి నాయకులకు కూడా పొలిట్ బ్యూరోలో చోటు కల్పించడం ద్వారా సాధారణ కార్యకర్తలకు ఉన్నత స్థాయికి ఎదగడానికి అవకాశం ఉందని బలమైన సందేశాన్ని పార్టీ పంపింది. ఇది కార్యకర్తల ఉత్సాహాన్ని పెంచే చర్యగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మార్పులతో పార్టీ నిర్మాణంలో కొత్త ఉత్సాహం నింపే ప్రయత్నం జరుగుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని పెంచడం, కార్యకర్తలను మరింత చురుకుగా మార్చడం లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.ఇకపై

3

# కడపలో కలకలం

- తల్లి కోసం తండ్రిని హతమార్చిన బాలుడు
- మద్యం మత్తులో తల్లిపై దాడి
- ఆవేశంలో కుమారుడి దారుణ చర్య
- కేసు నమోదు దర్యాప్తు ప్రారంభం



3

# ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ



మనప్రజాప్రతినిధి//చేర్యాల, జనగామ: జనగామ నియోజకవర్గం.భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి,మరియు కొమ్మూరి ప్రతాపరెడ్డి,సహకారంతో చేర్యాల మున్సిపల్ పట్టణ కేంద్రంలో పన్నెండవ వార్డు యందు నాగిల్ల లక్ష్మీ శేఖర్,నూతన ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న వార్డు కౌన్సిలర్ మహమ్మద్ షరీఫా బేగం ఖాజా,శంకుస్థాపన కార్యక్రమానికి హాజరై ఈ సందర్భంగా పన్నెండవ వార్డుకు ఎంపీ సహకారంతో ఎనమిది ఇల్లులు మంజూరవడం తో వార్డు ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో కూడా వార్డుకు అత్యధిక ఇందిరమ్మ ఇల్లు మంజూరుకై తమ వంతు ప్రయత్నం చేస్తామని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొమ్ము రాజేశ్వరి,పొతిగంట్టి ప్రసాద్,మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాటం మల్లేశం,మాజీ కోఆప్షన్ నెంబర్ ఎండి ఖాజా,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాటిపాముల పరశురాములు,పచ్చి మండ్ల వెంకటయ్య గౌడ్,మాచర్ల వెంకట్, తుమ్మలపల్లి సంతోష్,తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రజెండాలను ఎగురవేసి జయప్రదం చేయండి



మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల, జనగామ: జనగామ నియోజకవర్గం. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకలను మండలంలోని అన్ని గ్రామాల సిపిఎం, సీఐటీయూ హమాలీ కార్మికులు,బీడీ కార్మికులు,ఆశ వర్కర్స్, అంగన్వాడీ,గ్రామ పంచాయతీ కార్మికులు,తదితర అసంఘటిత కార్మికులు గ్రామ,గ్రామాన ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ని జరూపుకోవాలని సిపిఎం చేర్యాల మండల కార్యదర్శి బండకింది అరుణ్ పిలుపునిచ్చారు.ఈ రోజు మండలం లోని శబాష్ గూడెం,నాగపురి,పెద్ద రాజుపేట,పోతిరెడ్డి పల్లి, కడవేరుగు తదితర గ్రామాల్లో సిపిఎం, సీఐటీయూ,హమాలీ కార్మికులను కలిసిన అనంతరం మాట్లాడుతూ,ఆనాడు చికాగో నగరములో పద్దెనమీది గంటల పని దినాలకు వ్యతిరేకంగా కార్మికులు పెద్దఎత్తున విరోచత పోరాటాలు ఉద్యమా లు చెయడం జరిగిందని ఆ పోరాట ఫలితంగా పద్దెనమీది పని దినాల నుండి ఎనమిది గంటల పని దినాలు సాధించుకున్నారని, కానీ కేంద్రంలోఉన్న నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి కార్మికుల హక్కులను కాలరాస్తూ ఎనిమిది గంటల నుండి పన్నెండు గంటలు పని చేయాలని బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని, ఇప్పటికే ఇరవై తొమ్మిది రకాలుగా ఉన్న కార్మికుల హక్కులను కాలరాస్తు నాలుగు లేబర్ కోడులను తీసుకువచ్చి కార్మికుల హక్కులను హరించే విధంగా బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని అని ఆయన అన్నారు.అటువంటి కేంద్ర ప్రభుత్వం,తీసుకొచ్చినటువంటి కార్మికుల హక్కులను తీసివేసే కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు,కర్షకులు ప్రజలు రైతు కార్మికుల హక్కులను కాపాడుకునే విధంగా కేంద్ర ప్రభుత్వంపై పెద్ద ఎత్తున మే డే స్ఫూర్తితో పోరాడాలని ఆయన కార్మికులకు పిలునిచ్చారు.ఈ సమావేశంలో సిపిఎం మండల నాయకులు నంగి మైస్సయ్య,మోకు దేవేందర్ రెడ్డి,మోకు ఇంద్రం,దండ్ల రమేష్,గందాల బాల్,గర్నేపల్లి చంద్రం,దండ్ల కొమురయ్య,కత్తుల నర్సింహారెడ్డి, సీఐటీయూ, మండల అధ్యక్షులు ఎలుగు రవీందర్,నాయకులు దేవనబోయిన కనకయ్య,ఉల్లంపల్లి రవి,బుచ్చేళ్ళి నర్సింగ రావు,ఆవుల నర్సింలు,పుట్ట రాములు, మంజే స్వామి,ఎదుల కనకయ్య,బొడ్డు శంకర్, శ్రీ రాముల కనకయ్య,కొయ్యడ భాస్కర్,చెంద్రయ్య, రాజు,రమేష్ ,తదితరులు పాల్గొన్నారు

# నూతన దంపతులను ఆశీర్వదించిన జనగామ ఎమ్మెల్యే పల్లా



మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల, జనగామ :జనగామ నియోజకవర్గం.సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రంలోని వీరభద్ర గార్డెన్లో జరిగిన వివాహ వేడుకలో జనగామ శాసనసభ్యులు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.మాజీ ఎంపిటిసి ముచ్చంతల సుక్కా రెడ్డి వినోద,కుమారుడు నవీన్ రెడ్డి కి శిరీష రెడ్డితో వివాహం జరిగింది.ఈ శుభకార్యంలో పాల్గొని,నూతన వధూవరులను డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, హృదయపూర్వకంగా ఆశీర్వదించారు.అలాగే పట్టణంలోని పలు వివాహాది శుభకార్యాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారితోపాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,ఆయన వెంట ఉన్నారు.

# టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేశ్ ప్రమాణస్వీకారం

ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ నారా లోకేశ్ పాత్ర మరింత కీలకంగా మారనుంది. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసే బాధ్యతను ఆయన భుజాన వేసుకున్నట్లు కనిపిస్తోంది. పదవుల కేటాయింపులో సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని ఈ భారీ కార్యవర్గాన్ని రూపొందించడం ద్వారా అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే ప్రయత్నం చేశారు. దీంతో పార్టీకి విస్తృత మద్దతు లభించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




# కడపలో కలకలం...




కడప, ఏప్రిల్ 29 (మనప్రజాప్రతినిధి): కడప జిల్లాలోని చాపాడు మండలం ఓబుల్‌రెడ్డిపేటలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కన్నతల్లిని వేధిస్తున్నాడన్న ఆగ్రహంతో 16 ఏళ్ల బాలుడు తన తండ్రిని కత్తితో పొడిచి హత్య చేయడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతుడు కొంతకాలంగా మద్యానికి బానిసై రోజూ మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడేవాడు. కుటుంబంలో తరచూ కలహాలు జరుగుతున్న నేపథ్యంలో నిన్న రాత్రి కూడా మద్యం మత్తులో ఇంటికి వచ్చిన అతడు భార్యను వేధించడంతో పాటు దాడి చేసినట్లు సమాచారం.ఈ దృశ్యాన్ని చూసిన బాలుడు తీవ్ర ఆవేశానికి గురయ్యాడు. తన తల్లిని రక్షించాలన్న ఉద్దేశంతో ఇంట్లో ఉన్న కత్తిని తీసుకుని తండ్రిపై దాడి చేశాడు. ఈ దాడిలో అతను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలను సేకరించారు.ఈ కేసులో నిందితుడైన బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్యపానం, కుటుంబ కలహాలే ఈ దారుణానికి ప్రధాన కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. పూర్తి వివరాలు తెలుసుకునేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో ప్రాంతంలో ఆందోళన నెలకొంది. కుటుంబ విభేదాలు తీవ్ర పరిణామాలకు దారి తీస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# టీడీపీ శిక్షణా తరగతులు

**-క్షేత్రస్థాయిలో బలోపేతంపై దృష్టి**
**-మంగళగిరిలో నిర్వహించిన కార్యక్రమం**
**-కార్యకర్తల నైపుణ్యాల పెంపుపై దిశానిర్దేశం**
**-ప్రజా సమస్యలపై స్పందనకు ప్రాధాన్యం**





మంగళగిరి, ఏప్రిల్ 29 (మనప్రజాప్రతినిధి): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు, రాష్ట్ర కార్యదర్శుల కోసం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వంగలపూడి అనిత పాల్గొని కార్యకర్తలకు కీలక మార్గదర్శకాలు ఇచ్చారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించే తీరు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లే విధానాలపై ప్రత్యేకంగా చర్చించారు.నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన వ్యవహారం ప్రతి కార్యకర్తలో ఉండాలని అనిత సూచించారు. పార్టీ ప్రతిష్టను కాపాడుతూ, ప్రజల నమ్మకాన్ని గెలుచుకునేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని పేర్కొన్నారు. ఈ శిక్షణా తరగతులు కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపడంతో పాటు, సమన్వయాన్ని పెంచేందుకు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. క్రమబద్ధమైన శిక్షణ ద్వారా పార్టీ బలం మరింత పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడం ద్వారా ప్రజలకు చేరువ కావాలని సూచించారు. ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై వారి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కార మార్గాలను చూపాలని అన్నారు. మొత్తానికి ఈ శిక్షణా కార్యక్రమాలు పార్టీని మరింత శక్తివంతంగా ముందుకు నడిపించే దిశగా కీలక పాత్ర పోషిస్తాయని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు.

# రైతు కొనుగోళ్లపై సీఎం కు హరీశ్ రావు బహిరంగ లేఖ

**-కాంగ్రెస్ హామీలపై తీవ్ర విమర్శలు**
**-వరి, శనగ, జొన్న రైతుల సమస్యల ప్రస్తావన**
**-వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్**



# బీఆర్ఎస్ ఎన్నారై కమిటీల రద్దు

**-ప్రక్షాళన దిశగా కీలక అడుగు**
**-క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి వ్యూహాత్మక నిర్ణయం**
**-సమగ్ర సభ్యత్వ నమోదు తర్వాతే కొత్త కమిటీల ఏర్పాటు**
**-అంతర్జాతీయ స్థాయిలో పార్టీకి కొత్త ఉత్సాహం లక్ష్యం**



హైదరాబాద్, ఏప్రిల్ 29 (మనప్రజాప్రతినిధి): తెలంగాణలో రాజకీయ పునర్వ్యవస్థీకరణ దిశగా బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీని క్షేత్రస్థాయి నుంచి పూర్తిగా ప్రక్షాళన చేయాలన్న అధినేత కేసీఆర్ సంకల్పంలో భాగంగా, విదేశాల్లో ఉన్న ఎన్నారై విభాగంలో పెద్ద ఎత్తున మార్పులు చేపట్టారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని బీఆర్ఎస్ ఎన్నారై కమిటీలను రద్దు చేస్తున్నట్లు పార్టీ గ్లోబల్ సమన్వయకర్త మహేశ్ బిగాల అధికారికంగా ప్రకటించారు. ఈ నిర్ణయం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సుదీర్ఘ చర్చల అనంతరం తీసుకున్నదిగా వెల్లడించారు. గతంలో ఏర్పాటైన కమిటీల పనితీరు, సమన్వయం, కార్యకలాపాలపై సమగ్ర సమీక్ష అనంతరం, పార్టీని మరింత పటిష్టంగా తీర్చిదిద్దేందుకు ఈ చర్యలు అవసరమని భావించినట్లు సమాచారం. మారుతున్న రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా పార్టీ నిర్మాణాన్ని కొత్త దిశలో తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఈ ప్రక్షాళన కార్యక్రమం చేపట్టినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.పాత కమిటీల స్థానంలో యువతకు, చురుకైన కార్యకర్తలకు అవకాశం కల్పించేలా కొత్త రక్తంతో విభాగాలను పునర్నిర్మించనున్నారు. విదేశాల్లో ఉన్న తెలంగాణ వాసులను మరింతగా ఆకర్షించి, పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా వ్యాప్తి చేయాలనే లక్ష్యంతో ఈ మార్పులు చేపడుతున్నారు. ఎన్నారై విభాగం పార్టీకి కీలక బలం కావడంతో, దాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది. త్వరలోనే విదేశాల్లో ఉన్న పార్టీ మద్దతుదారుల కోసం సమగ్ర సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా నిజమైన కార్యకర్తలను గుర్తించి, వారిని పార్టీ నిర్మాణంలో భాగస్వాములను చేయాలని యోచిస్తున్నారు. సభ్యత్వ నమోదు పూర్తయిన అనంతరం కొత్త మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా కమిటీలను నియమించనున్నట్లు తెలిపారు.ఈ మార్పుల సమయంలో ఎన్నారై సభ్యులు, మద్దతుదారులు సహనంతో వ్యవహరించాలని మహేశ్ బిగాల పిలుపునిచ్చారు. పార్టీ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో అందరూ సహకరించాలని కోరారు. తాత్కాలికంగా ఏర్పడే అసౌకర్యాలను అర్థం చేసుకుని పార్టీ బలోపేతానికి తోడ్పడాలని సూచించారు. మొత్తానికి ఈ నిర్ణయం బీఆర్ఎస్ పార్టీకి కొత్త దిశను నిర్దేశించేలా కనిపిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో పార్టీ ప్రభావాన్ని పెంచడంతో పాటు, భవిష్యత్ రాజకీయ సమీకరణల్లో బలంగా నిలబడేందుకు ఈ పునర్వ్యవస్థీకరణ కీలకంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మాజీ సీఎం కలసిన బక్కి వెంకటయ్య



మనప్రజాప్రతినిధి//అక్బర్ పేట్ భూంపల్లి: తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్య మంత్రివర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు ని కుటుంబ సమేతంగా కలిసి గౌరవ.శ్రీ.తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ గౌరవ శ్రీ.బక్కి వెంకటయ్య, మర్యాదపూర్వకంగా కలిసి తన చిన్న కూతురు స్పందన-రంజిత్ ల వివాహం 14/05/2026 అమెరికా లోని డల్లాస్ లో నిర్వహించిన లగ్న పత్రిక. కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కే సి ఆర్) ను శాలువాతో సన్మానం చేసి కుటుంబ సమేతంగా వివాహానికి హాజరు కావాలని మర్యాద పూర్వకంగా తెలంగాణ రాష్ట్ర ఎస్ సి ఎస్ టి కమిసషన్ చైర్మన్ బక్కివెంకటయ్య కోరారు.

# పదవ తరగతి ఫలితాల్లో ఇంగ్లీష్ యూనియన్ హై స్కూల్ ప్రభంజనం




మనప్రజాప్రతినిధి/రాజన్నసిరిసిల్ల, ఏప్రిల్ 29:నేడు విడుదలైన ఎస్ఎస్సి ఫలితాలలో సిరిసిల్లలోని ఇంగ్లీష్ యూనియన్ హై స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి మార్కులతో సత్తా చాటారు. పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ స్కోర్లు సాధించి విద్యాసంస్థ పేరును నిలబెట్టారు.పాఠశాల విద్యార్థుల్లో టి. నిహిత 577 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, కె. మధుమిత 573 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. వీరితో పాటు పి. సాయి చరణ్ (565), పి. ఆశిష్ (563), మరియు ఎం. మనోజ్ (552) మార్కులతో ఉత్తమ ఫలితాలను సాధించారు.ఈ ఏడాది పరీక్షలకు హాజరైన మొత్తం 26 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి, పాఠశాల 100% ఫలితాలను నమోదు చేసింది. విశేషమేమిటంటే, పరీక్ష రాసిన 26 మందిలో 20 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి రికార్డు సృష్టించారు.విద్యార్థుల ఘనతపై పాఠశాల కరస్పాండెంట్ రాజ్ కుమార్ గారు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల కఠోర శ్రమ, ఉపాధ్యాయుల అంకితభావం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను కరస్పాండెంట్ తో పాటు ఉపాధ్యాయ బృందం ఘనంగా అభినందించారు.

# పదవ తరగతి విద్యార్థుల ఉత్తమ ఫలితాలు



నేరేడుచర్ల (మన ప్రజాప్రతినిధి దినపత్రిక ):పిఎంశ్రీ జిల్లాపరిషత్ఉన్నతపాఠశాల నేరేడుచర్ల విద్యార్థినీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వారిని పాఠశాలలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు బట్టు మధు నేతృత్వంలో అభినందించారు మన్నెం లిఖిత 536 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలవగా, 528 మార్కులతో ద్వితీయ స్థానంలో నాలం దర్శిని మరియు తాళ్లపల్లి రోహన్ ఇరువురు నిలిచారు మోడేపల్లి నాగమల్లిక 508, పాల్వాయి సాకేత్ 507, తాళ్లూరి అరుణ్ కుమార్ 503 సాధించడం అభినందనీయమన్నారు వీరికి మార్కుల మెమోలను అందించి అభినందించారు పరీక్షకు హాజరైన వారు 52 ఉత్తీర్ణత సాధించిన వారు 49 ,ఉత్తీర్ణత శాతం 94% సాధించారు

# పది ఫలితాల్లో 99.9శాతం ఉత్తీర్ణత

**-మండల టాపర్ గా అస్మిత రాజ్,సెకండ్ టాపర్ గా వెంకటేష్**
**- ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ, బృందాన్ని అభినందించిన ఎంఈఓ నీరజ**




మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ,ఏప్రిల్29:బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో చేగుంట మండలం 99.9 శాతం ఉత్తీర్ణత సాధించింది. మండలంలో 11 ఉన్నత పాఠశాలలకు గాను నూటికి నూరు శాతం ఉత్తీర్ణత వచ్చింది. మండలంలో 99.9శాతం ఉత్తీర్ణత సాధించినందుకు గాను ఉన్నత పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయ బృందాన్ని మండల విద్యాధికారి నీరజ అభినందించారు. మాడల్ పాఠశాల విద్యార్థి అస్మిత రాజ్ 576 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచింది. పీఎం శ్రీ ఉన్నత పాఠశాల చందాయిపేట్ కు చెందిన వెంకటేష్ 573మార్కులు సాధించి సెకండ్ టాపర్ గా నిలిచారు, ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందించారు. 99.9 శాతం ఉత్తీర్ణతకు కష్టపడ్డ ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందానికి, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# వడ్ల కొనుగోలు కేంద్రాం ప్రారంభం



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్:మండల పరిధిలోని ఖమ్మం పల్లి గ్రామంలో బుధవారం రోజు ఐకెపి సెంటర్ ద్వారా వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,గ్రామ సర్పంచ్ తిమ్మాపూర్ కర్ణాకర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగరావు,గ్రామ పాలకవర్గం సభ్యులు, రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి అర్థిక సహాయం



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఏప్రిల్ 29 :మెదక్ జిల్లా, చేగుంట మండల పరిధిలోని వడియారం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన బండారి పెద్ద బాలయ్య కుటుంబానికి బిజెపి సీనియర్ నాయకులు చిలకమర్రి గోవింద్ తరపున మానవతా దృక్పథంతో నిత్యావసర సరుకులు సాయం అందించారు. మృతుడి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న గోవింద్ ఆదేశాల మేరకు, ఆ కుటుంబానికి సహాయంగా 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు కూతురు కవితా బాలకిషన్, బొల్లి శ్రవణ్ లతో పాటు బిజెపి నాయకులు జనగామ వంశీ గౌడ్, రాము తదితరులు పాల్గొని బియ్యాన్ని అందజేసి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచిన చిలకమర్రి గోవింద్ కి,బిజెపి నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# సైబర్ క్రైమ్ పై అవగాహన కలిగి ఉండాలి

-అనధికారిక వ్యక్తులకు ఫోన్ ద్వారా ఓటీపీలు ఇతర సమాచారం ఇవ్వవద్దు

-విద్యార్థులు చదవడం, ఆటల్లోనూ ఉండాలి

-అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

-హాజరైన ఎస్పీ మహేష్ బి గితే

-ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలల భద్రత.. డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాల సందర్భంగా సైబర్ క్రైమ్ పై ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో అవగాహన కార్యక్రమం




మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 29 ఏప్రిల్ :సైబర్ క్రైమ్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బాలల భద్రత, డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాల సందర్భంగా సైబర్ క్రైమ్ పై ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని మహిళా, శిశు, దివ్యాంగులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ, పోలీస్ తదితర శాఖల ఆద్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా షి టీమ్ నంబర్ 87126 56425, మిషన్ వాత్సల్య, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, టెలీ మానస్ 14416 హెల్ప్ లైన్ పై వివరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు. డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించామని పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంక్, ఇతర సంస్థల నుంచి ఫోన్ చేస్తున్నామని, ఓటీపీ, ఇతర వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఏపీకే ఫైల్స్ ఫోన్ కు పంపి హ్యాకింగ్ చేస్తారని తెలిపారు. మొబైల్ ఫోన్ వినియోగించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930, బాలల హెల్ప్ లైన్ 1098, 112, ఇతర సహాయం అందించే అన్ని హెల్ప్ లైన్ నంబర్లు ప్రతి ఒక్కరూ తమ ఫోన్ లో సేవ్ చేసుకోవాలని సూచించారు. బాలికలు, కిశోర బాలికలు, యువతులు ఎలాంటి వేధింపులకు గురైనా వెంటనే సంబంధిత హెల్ప్ లైన్ లో సంప్రదించాలని తెలిపారు. విద్యార్థులు ఆటలు ఆడాలని, కచ్చితంగా చదవాలని తాము అనుకున్న లక్ష్యం చేరుకోవాలని పేర్కొన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసం చేయాలని, ఏదైనా కొలువు సాధించాలని ఆకాంక్షించారు. డ్రాప్ ఔట్ కావద్దని స్పష్టం చేశారు.మూడేండ్ల వయసు, అలాగే ఆరేండ్లలోపు పిల్లలు తమ సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో నమోదు కావాలని సూచించారు. కోడిగుడ్లు, బాలామృతం, ఇక్రిశాట్ వారి సూచనల మేరకు రూపొందించిన స్నాక్స్, పాలు పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. చదివే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పిల్లలు తినడం, ఆడుకోవడం ఇతర అంశాల్లో రాణిస్తారని తెలిపారు.



అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి నెలా పిల్లల ఎత్తు, బరువు కొలుస్తారని, దానికి సంబంధించిన కార్డులో నమోదు చేస్తారని, ఎదుగుదల లోపించిన పిల్లలకు ప్రత్యేక వైద్యం, పోషకాహారం అందిస్తారని తెలిపారు.శారీరక, మానసిక ఇతర ఎదుగుదల లోపించిన పిల్లలను ఆర్ బీ ఎస్ కే వాహనాల ద్వారా వేములవాడలోని డీఈఐసీ హాస్పిటల్ తీసుకువెళ్తారని వివరించారు. జిల్లాలో ఎవరైనా సైబర్ క్రైమ్ కు గురైతే వెంటనే 1930 లేదా సమీప పోలీసులను సంప్రదించాలని ఎస్పీ మహేష్ బి గితే సూచించారు. ఎలాంటి గుర్తింపు లేని వారు ఫోన్ చేసి ఓటీ పీ, ఇతర వివరాలు చెప్పమంటే స్పందించవద్దని తెలిపారు. క్రెడిట్, డెబిట్ కార్డు యాక్టివేషన్, బ్యాంక్, పోస్ట్ ఆఫీస్ నుంచి చేస్తున్నామని ఫోన్లో అడిగే వారికి స్పందించవద్దని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు డిజిటల్ అరెస్ట్ కాలేదని స్పష్టం చేశారు. అలాగే జనగణన కోసం ఇంటింటికి ప్రభుత్వ ఉద్యోగులు వస్తారని, వారి గుర్తింపు కార్డు, వివరాలు తెలుసుకున్న తరువాత అందరూ తమ వివరాలు వెల్లడించాలని తెలిపారు. మహిళలు, యువతల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో తమ వ్యక్తిగత ఫోటోలు షేర్ చేయవద్దని సూచించారు. కొందరు వ్యక్తులు మహిళలు, యువతుల ఫోటోలు మార్ఫింగ్ చేసి ఇబ్బందులకు గురి చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సోషల్ మీడియా వాడే అప్పుడు జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. సోషల్ మీడియా అకౌంట్ ప్రైవేట్ అని పెట్టాలని, పబ్లిక్ అని పెట్టవద్దని తెలిపారు.జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా అరైవ్.. అలైవ్ కింద వాహనదారులకు ట్రాఫిక్ నియమాలు, నిబంధనలపై అవగాహన కల్పించామని తెలిపారు. ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. హెల్మెట్ లేకుండా వెళ్లడంతో నాంపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో బుధవారం ఉదయం ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ లేకుండా వెళ్లడంతో మృతి చెందాడని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. గ్రామంలో ఏర్పాటు అయిన రోడ్ సేఫ్టీ కమిటీ బ్లాక్ స్పాట్స్ గుర్తించి.. నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని, వేసవి నేపథ్యంలో ఎండలో తిరగవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఎస్పీ నాగేంద్రాచారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ శశికళ, సర్పంచ్ గన్నారం వసంత తదితరులు పాల్గొన్నారు

# స్కూల్ టాపర్ గా అవంతి



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్:పదో తరగతి పరీక్ష ఫలితాలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సత్తా చాటింది. కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం గ్రామానికి చెందిన విద్యార్థిని గొల్లెన అవంతి 10వ తరగతిలో 513 మార్కులు సాధించింది.తిప్పారం ప్రభుత్వ పాఠశాలలో ని పదవ తరగతి విద్యార్థులు ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.ప్రభుత్వ స్కూల్లో చదివి 513 మార్కులు సాధించిన విద్యార్థిని అవంతి తో పాటు ఆమె తల్లిదండ్రులు, పాఠశాల అధ్యాపక బృందాన్ని మండల విద్యాశాఖ అధికారులు, గ్రామ సర్పంచ్ ఆకుల భద్రప్ప అభినందించారు.ఈ విజయం తమ తల్లిదండ్రుల శ్రమతో పాటు అధ్యాపక బృందం సహకారం ఎంతో ఉందని ఈ సందర్భంగా వారికి విద్యార్థిని ధన్యవాదాలు తెలిపి హర్షం వ్యక్తం చేసింది.

# నీరు, పారిశుధ్యంపై శిక్షణా కార్యక్రమం



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట, ఏప్రిల్ 29 :మెదక్ జిల్లా, చేగుంట మండలం మహిళా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ ( వివో ఏ) ఓబీలకు నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత అంశాలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాష్ తెలంగాణ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ బ్రహ్మాచారి మాట్లాడుతూ.. సురక్షిత తాగునీరు, మరుగుదొడ్ల వినియోగం, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా అప్మాస్ సంస్థ ద్వారా మహిళా సభ్యులు ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే 2 లక్షల రూపాయలు, కమ్యూనిటీ బోర్ వెల్ వేసుకుంటే 25 వేల రూపాయల సబ్సిడీ అందుతుందని వెల్లడించారు. జిల్లా ప్రాజెక్టు అధికారి శ్రీమతి అనిత, ఏపీఎం దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి సంఘం సమావేశంలో పారిశుధ్యాన్ని ఒక అజెండాగా చేర్చి, ప్రతి ఇంటికీ ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించాలని విఓఏలకు సూచించారు. గ్రామాల్లోని ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటి పరిసరాల శుభ్రతపై విఓఏలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం, సీసీలు, మండల సమాఖ్య అధికారులు విఓఏలు పాల్గొన్నారు.

# ఈనెల 30న జరిగే హిందూ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



మన ప్రజా ప్రతినిధి ఏప్రిల్ 28):దౌల్తాబాద్, ఏప్రిల్ 28: ఈనెల 30న దౌల్తాబాద్ మండల కేంద్రంలోని హైస్కూల్ ఆవరణలో నిర్వహించనున్న హిందూ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని హిందూ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువుల ఐక్యతకు ఇలాంటి సమ్మేళనాలు కీలకంగా నిలుస్తాయని అన్నారు. మండలంలోని ప్రతి ఇంటి నుండి పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమ్మేళనం ద్వారా సాంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణతో పాటు సమాజంలో ఐక్యతను పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. హిందూ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా శ్రీ గురుదత్త పీఠాధిపతి శ్రీరాం శరణ్ శర్మ గురూజీ, ప్రధాన వక్తగా రవీందర్ రెడ్డి తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కనక రాములు, ఆంజనేయులు, రమేష్, రాజు, రంజిత్, శ్రీకాంత్, స్వామి, వెంకటేష్, హిందూ సమ్మేళన సమితి సభ్యులు పాల్గొన్నారు.

# తలసేమియా చిన్నారుల కోసం కానిస్టేబుల్ పోచయ్య రక్తదానం

## మానవత్వం చాటుకున్న ఏఆర్ కానిస్టేబుల్



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,బచ్చన్నపేట, జనగామ నియోజకవర్గం: జనగామ నియోజకవర్గం.జన్యుపరమైన రక్త రుగ్మత 'తలసేమియా'తో బాధపడుతున్న చిన్నారులను ఆదుకోవడంలో జనగామ ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్ శాడ. పోచయ్య మరోసారి తన ఉదారతను చాటుకున్నారు.వేసవి కాలంలో తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తం అవసరం పెరిగిన దృష్ట్యా,బుధవారం ఆయన జనగామ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రక్తదానం చేశారు.సామాజిక బాధ్యతగా పోచయ్య ఇప్పటివరకు నలభై ఐదు సార్లు రక్తదానం చేయడం విశేషం.ఎండల తీవ్రతతో పెరిగిన అవసరం సాధారణంగా తలసేమియా చిన్నారులకు ప్రతి మూడు వారాలకు ఒకసారి రక్త మార్పిడి అవసరం అవుతుంది. కానీ ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత వల్ల వారికి ప్రతి రెండు వారాలకే రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. రక్త నిల్వలు తగ్గి చిన్నారులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో తాను రక్తదానం చేశానని,యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పోచయ్య కోరారు.పోలీస్ విధుల్లో ఉంటూనే ఆపదలో ఉన్న చిన్నారుల కోసం పోచయ్య చేస్తున్న ఈ సేవలను పలువురు అభినందిస్తున్నారు.

# పది ఫలితాల్లో 'శ్రీ రామకృష్ణ' ప్రభంజనం మండల టాపర్‌గా పోలోజు భావన

మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,బచ్చన్నపేట, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం.పదో తరగతి ఫలితాల్లో బచ్చన్నపేట మండలంలోని "శ్రీ రామకృష్ణ విద్యాలయం ఉన్నత పాఠశాల" మరోసారి తన విద్యా ప్రమాణాలను చాటుకుంది. ఏటా మండల,జిల్లా స్థాయి ర్యాంకులే లక్ష్యంగా సాగుతున్న ఈ సంస్థ, 2025-26 విద్యా సంవత్సరంలోనూ అద్భుత ఫలితాలను సాధించి తన ప్రత్యేకతను నిలబెట్టుకుంది.ప్రథమ స్థానం: పోలోజు భావన (563 మార్కులు). పోలోజు భావన కట్కూరు గ్రామానికి చెందిన పోలోజు రామబ్రహ్మం,లక్ష్మి దంపతుల కుమార్తె.ద్వితీయ స్థానం: సుహాన బేగం (557 మార్కులు)యాకుబ్, జరీనా కుమార్తె.తర్వాత స్థానాల్లో గొడుగు అభినవ్ కిరణ్ (543), కటకం లక్ష్మి ప్రసన్న (539),తేలుకంటి నందిని (502).విద్యార్థుల ఘనతపై పాఠశాల యాజమాన్యం కరికే ఊర్మిళ,ప్రసాద్ బాబు మరియు ప్రధానోపాధ్యాయులు నిమ్మ రామిరెడ్డి,హర్షం వ్యక్తం చేశారు.ఉపాధ్యాయ బృందం అంకితభావం, తల్లిదండ్రుల సహకారమే ఈ విజయానికి మూలమని వారు కొనియాడారు.ఇక మండల స్థాయిలో మొత్తం ఎస్ఎస్సి పాస్ శాతం 96.8% నమోదైంది. పదవ తరగతి పరీక్షలకు మొత్తం 419 మంది విద్యార్థులు హాజరుకాగా,అందులో అబ్బాయిలు 189 మంది హాజరై 183 మంది ఉత్తీర్ణులు, అమ్మాయిలు 230 మంది హాజరై 223 మంది ఉత్తీర్ణులు కావడం విశేషం.